కొద్ది క్షణాల మౌనం తర్వాత అతను తను చెప్పేది కొనసాగించాడు.

"దేవుడు నన్ను కష్టాలనే కొలిమిలో ఉంచి, బాధలనే సుత్తి దెబ్బలు వేస్తున్నాడని నాకు తెలుసు. అందువల్ల నేను పెద్దగా బాధపడను. ఎందుకంటే ఇప్పుడున్న ముడి స్థితి నించి నేను ఏ పరిమాణంలో, ఏ స్థితికి రావాలో దేవుడికి తెలుసు. కాబట్టి కష్టాలొచ్చినప్పుడు నేను దేవుణ్ని ప్రార్థించేది ఏమిటంటే ' ఓ దేవా! దయతో నన్ను నీ పద్ధతిలో ఇంకాస్త మెరుగైన స్థితికి మార్చు. అది తట్టుకునే శక్తి నాకు ప్రసాదించు తప్ప నేను పనికిమాలిన వాడినని ఎంచి నన్ను చెత్త కుప్పలోకి విసిరేయకు. "

## 79. దేవుడికి తెలుసు

కష్టాల్లో మనకి ఎటునించైనా సహాయం అందకపోతే దేవుడికి అసలు మనం ఉన్నామో లేదో తెలుసా అని ఒకొక్కప్పుడు అనిపిస్తుంది. కాని మనల్ని ప్రేమించే దేవుడికి మనం ఏ క్షణంలో ఎక్కడున్నామో స్పష్టంగా తెలుసు. ఎటొచ్చీ ఆ సంగతి మనకే తెలీదు. ఇది ఋజువు చేసే కథ ఇది.

ఓ రాత్రి పుండరీకరావుతో అతని భార్య చెప్పింది.

"నాకు తల నొప్పిగా వుంది. ఇంట్లో తలనొప్పి మాత్ర లేదు. బయటకి వెళ్ళి తీసుకురండి."

టి.వి. చూస్తున్న అతను దాని ముందు నుంచి లేవడానికి ఇష్టపడలేదు. భార్య పోరగా, పోరగా చివరికి మందుల షాపు కట్టేసే సమయానికి తమ వీధికి నాలుగు వీధుల అవతల వున్న మందుల షాపుకి వెళ్ళాడు. అప్పటికే దుకాణం లోంచి బయటకి వచ్చిన దాని యజమాని షట్టర్ దించబోతూ, పుండరీకరావుని చూసి ఆగాడు.

పుండరీకరావు తలనొప్పి మాత్రలు కొన్నాక ఇద్దరూ బయటకి రాబోతూంటే దుకాణంలోని ఫోన్ మోగింది. దుకాణం యజమాని రిసీవర్ ఎత్తి అవతలి వైపు వాళ్ళు చెప్పేది విని, 'ఒన్ సెకండ్' అని పుండరీకరావు వైపు తిరిగి అడిగాడు.

"మీ పేరు పుండరీకరావా?"

"అవును?"

"మీకు ఫోన్."

పుండరీకరావుకి ఆశ్చర్యం వేసింది. తనా షాప్‌కి వస్తున్నట్లు ఎవరికీ తెలీదు. తన భార్యకి కూడా ఈ ఫోన్ నంబరు తెలీదు.

"నాకిక్కడికి ఎవరూ ఫోన్ చేయరు." చెప్పాడు.

"ఎవరో లేడి సార్. మీ పేరే అడుగుతున్నారు." చెప్పాడు అతను.

పుండరీకరావు రిసీవర్ అందుకుని చెప్పాడు.

"హలో. ఎవరూ?"

"మీరు నిజంగా పుండరీకరావేనా?" దుఃఖంతో కూడిన ఓ ఆడకంఠం ఆత్రంగా అడిగింది.

"అవును. నా పేరు పుండరీకరావు. ఇంతకీ మీరెవరు?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు అతను.

"థాంక్ గాడ్! నా పేరు పద్మావతి."

"మీరెవరో నాకు తెలీదు. ఈ టైంలో ఈ నంబర్‌కి నాకోసం ఎందుకు ఫోన్ చేసారు? అసలు మీరు ఎక్కడనించి మాట్లాడుతున్నారు?" అడిగాడు పుండరీకరావు.

"విజయనగర్ కాలని నించి. మీరు నాకు తెలీదు. కాని మీరు నన్ను రక్షించారు." ఏడుపు, ఆనందం మిళితమైన కంఠంతో అవతల నించి చెప్పిందామె.

"మీరేమంటున్నారో నాకు అర్థం కావడం లేదు."

ఆమె ఏడుపుని ఆపుకునే ప్రయత్నాన్ని చేస్తోందని గుర్తించాడు పుండరీకరావు. అతనికి ఇదంతా విచిత్రంగా వుంది. చివరకి ఆమె నిబ్బరించుకుని చెప్పింది.

"నా ఎడమ చేతిలోని డబ్బాలో పురుగుల మందుంది. ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని అకుంటున్నానో నేను అయిదు నిముషాల క్రితం రాసిన వుత్తరం నా ముందుంది. నాకున్న సమస్యలకి చావే పరిష్కారం అయినా, నాకు నిజంగా

చావాలని లేదు. నేను మందు తాగబోతూ ఆగి దేవుణ్ణి ఒక్కటే ప్రార్థించాను. 'నా చేతికి వచ్చిన నంబర్‌ని డయల్ చేసి, తోచిన పేరుని అడుగుతాను. నేను బ్రతకాలని వుంటే ఆ నంబర్‌లో ఆ పేరుగల వాళ్ళతో మాట్లాడించు. నంబర్ కలవక పోయినా లేదా ఆ నంబర్‌లో ఆ పేరు గలవాళ్ళు లేకపోయినా వెంటనే ఈ మందు తాగేస్తాను' అనుకుని డయల్ చేసి పుండరీకరావు కోసం అడిగాను. నిజానికి నేను ఆ పేరు గలవారితో మాట్లాడుతున్నా నాకు నమ్మశక్యంగా లేదు."

"నా పేరు నిజంగా పుండరీకరావే. ఇది మెడికల్ షాపు. మా ఆవిడ తనకి తలనొప్పిగా వుందని, మందు తీసుకురమ్మని అరగంట నించి పోరుతూంటే ఇప్పుడే వచ్చాను. నిజానికి ఈ ఫోన్ నంబరుని మీరు డయల్ చేయడానికి ఆ దేవుడే మీ చేతి వేళ్ళల్లోకి ప్రవేశించి ఈ నంబర్‌ని డయల్ చేసి వుంటాడు. మీరు చావడం దేవుడికి ఇష్టం లేదని గ్రహించండి." చెప్పాడు పుండరీకరావు.

"థాంక్స్ రావు గారు. థాంక్స్ ఏ లాట్." ఆమె మాటల్లో రిలీఫ్ ధ్వనించింది.

వెంటనే లైన్ కట్ అయింది.

"ఏమిటి?" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు మెడికల్ షాపు యజమాని.

"ఏం లేదు. నేను ఇప్పుడు, ఇక్కడ మీ షాపులో మీ ఫోన్ ముందు వున్నానని దేవుడికి తెలుసు." ఆనందంగా నవ్వుతూ చెప్పాడు పుండరీకరావు.

## 80. సరైన ప్రవర్తన

యూదు రేబ్బి అకివ ఐజెల్ ఓసారి వర్షంలో ఓ గుర్రబ్బండిలో వెళ్తున్నాడు. అకస్మాత్తుగా ఆ బండి చక్రం ఇరుసు కొద్దిగా వదులైంది. బండిని నడిపేవాడు ఆ సంగతి అకివ ఐజెల్‌కి చెప్పి, బండి దిగి దాన్ని బాగు చేసి మళ్ళీ బండి ఎక్కాడు. కురిసిన వర్షం నీళ్ళల్లో అతని పాదాలు తడిసి, చలికి జివ్వుమనసాగాయి.

రేబ్బి బండి లోంచి పొడిగా వున్న నీలం రంగు సాక్స్ జతని బండి వాడికి ఇచ్చి చెప్పాడు.

"వీటిని ధరించు."